సాక్షి
నంద్యాల
మంగళవారం : 21 : మార్చి : 2023



అలరించిన సంగీత విభావరి

శ్రీశైలంటెంపుల్: ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన శివక్షేత్ర వైభవం పురాణ ప్రవచనం, హేమారెడ్డి మల్లమ్మ చరిత్ర, భక్తి సంగీత విభావరి, నృత్య రూపకాలు భక్తులను అలరించాయి.



వండేదంతా 'మంచి' నూనె కాదు

జిల్లాలో విచ్చలవిడిగా కల్తీనూనె విక్రయాలు జరుగుతున్నాయి. అధికారులు ఏడాదికి ఒకటి, రెండుసార్లు తనిఖీలు చేసి మమ అనిపిస్తున్నారు.

8లో ▶



వృద్ధిలోకి కేడీసీసీ బ్యాంకు

కొన్నేళ్లుగా ఉన్న నష్టాలను అధిగమించిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకు స్పష్టమైన లాభాల్లోకి వచ్చింది. బ్యాంకు టర్నోవర్ దాదాపు రూ.5వేల కోట్లకు చేరుకుంది.

8లో ▶

న్యూస్‌రీల్

స్వచ్ఛత మహిళా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(సిటీ): నంద్యాల మున్సిపల్ పరిధిలో విధులు నిర్వహిస్తూ పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ చూపిన మహిళల నుంచి ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత–2023 పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి సోమ వారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యక్తిగత, స్వయం సహాయక, చిన్న, తరహా, సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంకుల శుభ్రత, వ్యర్థాల శుద్ధీకరణ, చెత్త సేకరణ, తడి, పొడి చెత్తలతో కంపోస్టు తయారీ తదితర విభాగాల్లో అవార్డులు అందించనున్నామన్నా రు. ఆసక్తి కలిగిన మహిళలు ఈ నెల 23వ తేదీలోగా నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారికి జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో పురస్కారాలను అందజేస్తామన్నారు.

ఇంటర్ పరీక్షలకు 1,462 మంది గైర్హాజరు

నంద్యాల(సిటీ): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు 1,462 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐఓ గురువయ్యశెట్టి సోమవారం తెలిపారు. పార్ట్–3 లో మ్యాథమ్యాటిక్స్ పేపర్–1 ఏ, బోటనీ పేపర్–1, సివిక్స్ పేపర్–1 పరీక్షలను కర్నూలు, నంద్యాల జిల్లాలలో 38,378 మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా 36,916 మంది హాజరయ్యారు. జనరల్ ఇంటర్ విద్యార్థులు 1,261 మంది, ఒకేషనల్ విద్యార్థులు 201 మంది గైర్హాజరయ్యారు.

బేతంచెర్లకు పాలిటెక్నిక్ కళాశాల మంజూరు

బేతంచెర్ల: మండలానికి పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేస్తూ ప్రభుత్వ కార్యదర్శి సౌరభ్ గౌర్ సోమవారం గెజిట్ విడుదల చేశారు. నంద్యాల జిల్లాలోని బేతంచెర్ల, అనంతపురం జిల్లా గుంతకల్, వైఎస్సార్ జిల్లాలో మైదుకూర్‌లో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు గతంలోనే గోరుమానుకొండ గ్రామ సమీపంలో మోడల్ స్కూలు పక్కన్న సుమారు 4 ఎకరాల స్థలాన్ని జిల్లా అధికారులు కేటాయించారు. యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు అవసరమైన సాంకేతిక విద్యను అందించే పాలిటెక్నిక్ కళాశాల మంజూరు కావడం పట్ల ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రూ.30 కోట్లతో ఈ కళాశాల ఏర్పాటుకానుందన్నారు. జిల్లా యువత తరఫున మంత్రి బుగ్గన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతానికి పాలిటెక్నిక్ కళాశాల మంజూరు కావడంతో ఎంతో మంది యువత స్థానికంగానే డిప్లొమా కోర్సులు చేసే అవకాశం లభించందన్నారు.

సిరిధాన్యాలతో ఆరోగ్య సంరక్షణ

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: అత్యధిక పోషకాలు ఉన్న సిరి ధాన్యాలను ఆహారంగా తీసుకోవడంతో ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల మహోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్ర, ఐసీడీఎస్ తదితర శాఖల సహకారంతో సోమవారం నంద్యాల కలెక్టరేట్‌లోని వైఎస్ఆర్ సెంటినరీ హాల్ ప్రాంగణంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సిరిధాన్యాల స్టాళ్లను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అతి తక్కువ నీరు, తక్కువ ఖర్చుతో చేసే సిరిధాన్యాల సాగుపై రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలోనే కాకుండా మండల స్థాయిలో కూడా చిరుధాన్యాల ఉత్పత్తులపై స్టాళ్లు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. కల్తీ ఆహార పదార్థాలు తీసుకోకుండా అధిక పోషకాలు ఉండే చిరుధ్యానాలను ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. జిల్లాలో సిరిధాన్యాల సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు కృషి చేయాలన్నారు. అంతకు ముందు మహిళా సంఘాలు తయారు చేసిన పది రకాల సిరి ధాన్యాల ఆహార పదార్థాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఆర్ఓ పుల్లయ్య, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి జయదేవ్, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



నల్లమల మార్గంలో పాదయాత్రగా శ్రీశైలం చేరుకుంటూ..



పాతాళగంగలో పుణ్య స్నానాలు చేస్తూ..



భక్తులతో కిక్కిరిసిన ప్రధాన పురవీధులు



కిటకిటలాడుతున్న క్యూలు

అభయమివ్వు మహాదుర్గ!

- శ్రీశైలంలో మిన్నంటిన ఉగాది ఉత్సవాలు
- మహాదుర్గ అలంకారంలో దర్శనమిచ్చిన భ్రమరాంబ
- కనులపండువగా కైలాసవాహన సేవ
- కన్నడిగులతో పోటెత్తిన శ్రీగిరి వీధులు



ఉత్సవంలో హోరెత్తించిన డోలు కళాకారులు



ఆలయ ప్రదక్షిణలో ఆదిదంపతులు (ఇన్‌సెట్లో) మహాదుర్గ అలంకారంలో శ్రీశైల భ్రామరి

శ్రీశైలంటెంపుల్: అష్టభుజాలతో శంఖం, చక్రం, గద, పద్మం, త్రిశూలం, ఖడ్గం ధరించి మహాదుర్గ అలంకారంలో భ్రమరాంబదేవి భక్తులకు అభయమిచ్చారు. కనులారా దర్శించుకున్న భక్తులు శుభములివ్వు తల్లీ అంటూ ప్రణమిల్లారు. శ్రీశైల క్షేత్రంలో ఉగాది మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం అమ్మవారు మహాదుర్గ అలంకారంలో భక్తులను కటాక్షించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం చండీశ్వరపూజ, మండపారాధన, లోకకల్యాణం కోసం జపానుష్టానాలు నిర్వహించారు. 9 గంటలకు స్వామివారి యాగశాలలో రుద్రహోమం, అమ్మవారి యాగశాలలో చండీహోమం నిర్వహించారు. అమ్మవారికి విశేష కుంకుమార్చన, నవావరణార్చనలు, సాయంత్రం జపానుష్టానములు జరిపించారు. అనంతరం ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో కైలాస వాహనాన్ని అధిష్టించిన స్వామిఅమ్మవార్లకు అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాదుర్గ అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారికి ప్రత్యేక హారతులిచ్చారు. మహాదుర్గగా అలంకీకృతులైన భ్రమరాంబాదేవిని, కైలాస వాహనాధీశులైన స్వామిఅమ్మవార్లను ఆలయ ప్రదక్షిణ నిర్వహించి రాజగోపురం మీదుగా క్షేత్రప్రధాన వీధుల్లోకి తోడ్కొని వచ్చారు. అనంతరం గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు అక్కడి నుంచి బయలు వీరభద్ర స్వామి ఆలయం వరకు గ్రామోత్సవం కొనసాగింది. ఉత్సవంలో కోలాటం, చెక్కభజన, పగటి వేషాల ప్రదర్శన, బుట్టబొమ్మలు, గొరవయ్యల నృత్యం, తప్పెట్లు, కొమ్ముువాయిద్యాలు, జానపదడోలు, నందికోలు నృత్యాలు ఆకట్టుకున్నాయి. కన్నడ భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకుని నీరాజనాలు సమర్పించారు. పూజా కార్యక్రమాల్లో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న దంపతులు, ఏఈవోలు హరిదాసు, ఫణిధరప్రసాద్, అర్చకులు, వేదపండితులు, అధికారులు పాల్గొన్నారు.



అగ్గితో కళాకారుడి విన్యాసం

నేడు వీరాచార విన్యాసాలు..

ఉగాది మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం సాయంత్రం 5 గంటలకు ప్రభోత్సవం నిర్వహిస్తారు. అలాగే స్వామిఅమ్మవార్లకు నందివాహనసేవ, శ్రీభ్రమరాంబాదేవికి మహా సరస్వతి అలంకార సేవ నిర్వహిస్తారు. రాత్రి 10 గంటలకు వీరశైవుల వీరాచార విన్యాసాలు, అగ్నిగుండ ప్రవేశం చేస్తారు. శివదీక్షా శిబిరాల వద్ద నిర్వహించే వీరచార విన్యాసాల కార్యక్రమానికి దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేయగా, పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు చేపట్టారు.

ఇలకైలాసం.. భక్తజన సంద్రం

ఇల కైలాసమైన శ్రీశైల మహాక్షేత్రం భక్తజన సంద్రంగా మారుతోంది. ఎండను సైతం లెక్కచేయకుండా నల్లమల అడవుల్లో పాదయాత్రగా లక్షలాది మంది భక్తులు తరలి వస్తున్నారు. క్షేత్ర వీధులు భక్తులతో పోటెత్తాయి. తప్పెట దరువులతో, రంగులు చల్లుకుంటూ, చిందులు వేస్తూ శ్రీశైలం చేరుకుని 'మల్లన్న..నీ దర్శనానికి వచ్చాం..అంటూ మనసారా స్మరించుకుంటున్నారు. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామిఅమ్మవార్ల దర్శనానికి బారులుదీరుతున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ఆలయ పూజా వేళలను మార్పులు చేసి వేకువజాము నుంచే దర్శనానికి అనుమతిస్తున్నారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్లు కిటకిటలాడుతున్నాయి. భక్తులందరికీ సౌకర్యవంతమైన దర్శనం కల్పించడంలో భాగంగా మల్లన్న అలంకార దర్శనానికి మాత్రమే అనుమతిస్తున్నారు.

స్పందన అర్జీదారులకు న్యాయం చేయండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్


నంద్యాల: స్పందన కార్యక్రమంలో స్వీకరించిన వినతులను సానుకూల దృక్పథంతో వ్యవహరించి అర్జీదారులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు డీఆర్ఓ పుల్లయ్య, జిల్లా ఉన్నతాధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన దరఖాస్తులను సీరియస్‌గా తీసుకొని క్షేత్రస్థాయిలో పర్యటించి నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రతిరోజు అరగంట సమయం వీటిపై దృష్టి సారిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. అర్జీలను సంతృప్తికర రీతిలో పరిష్కరించకపోతే మళ్లీ రీఓపెన్ అయ్యే అవకాశం ఉందన్నారు. కోర్టు కేసులకు సంబంధించి కంటెంట్ రాకుండా ఎప్పటికప్పుడు కౌంటర్ ఫైల్ చేయాలని, ఎన్ని పర్యాయాలు సమావేశాలు నిర్వహించి ఆదేశాలు జారీ చేసినప్పటికీ తహసీల్దార్లు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. స్పందనలో వచ్చిన 251 సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

వినతుల్లో కొన్ని..

- తను పేదరాలినని, జీవితం దుర్భరంగా గడుపుతున్నానని తమ గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిలో కొంత కేటాయించాలని మహానంది మండలం గోపవరానికి చెందిన ఎం.కవిత కలెక్టర్‌ను కోరారు.
- తన భర్త ఎస్జీటీగా పనిచేస్తూ ఆకస్మికంగా మృతి చెందారని, పెన్షన్ ప్రతిపాదనలలో ఫ్యామిలీ పెన్షన్ ఎవరికి ఇవ్వాలో రాయకపోవడంతో ఇప్పటి వరకు తనకు ఫ్యామిలీ పెన్షన్ రాలేదని సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని నంద్యాల మండలం పుసులూరు గ్రామానికి చెందిన రోసలీలమ్మ వినతి పత్రం అందజేశారు.
- ఉయ్యాలవాడ మండలంలో దళిత కుటుంబానికి చెందిన 20 మంది తమకు ఎలాంటి భూములు లేవని పేదరికంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో ఒక్కొక్కరికి ఎకరా పొలాన్ని మంజూరు చేయాల్సిందిగా కోరుతూ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

నేటి నుంచి విద్యార్థులకు రాగి జావ

- ఇంటర్వెల్ సమయంలో ఇచ్చేందుకు ఏర్పాట్లు పూర్తి
- ప్రతి విద్యార్థికి 150 ఎం.ఎల్ రాగి జావ



కర్నూలు సిటీ: ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు నేటి (మంగళవారం) నుంచి రాగి జావ అందించనున్నారు. జిల్లాలో 1,436 పాఠశాలల్లో 2.74 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ఉదయం 8.45 నిమిషాలకు రాగి జావ ఇవ్వాలని నిర్ణయించారు. అయితే ఆ సమయానికి వంట ఏజెన్సీలకు చెందిన వారు తయారు చేయడం సాధ్యం కాదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే పిల్లలు సైతం ఇళ్ల దగ్గర టిఫిన్/భోజనం చేసి వచ్చి ఉంటారు కాబట్టి ఇష్టంగా తీసుకోలేరని చెప్పారు. దీంతో ఇంటర్వెల్ సమయంలో ప్రతి విద్యార్థికి వారానికి మూడు సార్లు 150 ఎంఎల్ రాగి జావా ఇవ్వాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించనున్నారు. జిల్లా స్థాయి కార్యక్రమం బీక్యాంపులోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించనుండగా కలెక్టర్ పి. కోటేశ్వరరావు హాజరుకానున్నారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని ప్రభుత్వ స్కూళ్లకు రాగి పిండి, బెల్లం చేర్చారు.

విద్యార్థి బస్సుకు తప్పిన పెను ప్రమాదం

- అదుపు తప్పి గుంతలోకి దూసుకెళ్లిన బస్సు
- సమీపంలోనే ప్రమాదకర గోర్లగుట్ట మలుపులు



రహదారి పక్కన్న పైపులైను గుంతలోకి వెళ్లిన ఆర్టీసీ బస్సు

బేతంచెర్ల: సోమవారం ఉదయం బేతంచెర్ల నుంచి బనగానపల్లెకు వెళ్తున్న ఆర్టీసీ విద్యార్థి బస్సుకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. ఉదయం 7.45 గంటలకు 40 మంది విద్యార్థులతో బయలుదేరిన బస్సు పట్టణ శివారులో డౌన్‌కు వెళ్లే సమయంలో డ్రైవర్ మునిస్వామి గేర్ మార్చకుండా నిర్లక్ష్యంగా నడుపుతున్నాడు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో బస్సు అదుపు తప్పింది. పక్కనే పైప్‌లైన్ కోసం తవ్విన గుంతలోకి దూసుకెళ్లి నిలిచిపోయింది. లేదంటే పెను ప్రమాదం జరిగేది. కొద్ది దూరంలోనే ప్రమాదకర గోర్లగుట్ట మలుపులు ఉన్నాయి. అక్కడ అదుపు తప్పి వుంటే పెను ప్రమాదం జరిగే అవకాశం ఉండేది. సమాచారం అందుకున్న ఆర్టీసీ అధికారులు అక్కడికి చేరుకుని క్రేన్ సహాయంతో బస్సును బయటకు తీశారు. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ఈ సంఘటన చోటు చేసుకుందని బనగానపల్లె డిపో మేనేజర్ తెలిపారు.

అపరాధ వడ్డీ మాఫీ

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అమలు చేస్తున్న వడ్డీ ఉపశమన ప్రోత్సాహక పథకం ఈ నెల 31వ తేదీతో ముగియనుంది. కేడీసీసీబీ బ్రాంచీల నుంచి తీసుకున్న దీర్ఘకాలిక రుణాలకు మాత్రమే ఈ పథకం వర్తించనుంది. 2019 ఏప్రిల్ 1 నాటికి రుణం తీసుకొని.. 2022 డిసెంబర్ 14 నాటికి బకాయిగా ఉన్న రైతులు మాత్రమే ఇందుకు అర్హులు. ఈ నెల చివరిలోపు బకాయి మొత్తం చెల్లించిన రైతులకు వడ్డీలో 75 శాతం లేదా రూ.50 వేలు.. ఏదీ తక్కువైతే ఆ మొత్తాన్ని మినహాయిస్తారు.

ఉత్సవాల్లో పటిష్టమైన బందోబస్తు



సీఐతో మాట్లాడుతున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

శ్రీశైలం: శ్రీశైల మహాక్షేత్రంలో ఉగాది ఉత్సవాల సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం శ్రీశైలం చేరుకున్న ఆయన క్షేత్ర పరిధిలో పర్యటించి బందోబస్తులో ఉన్న పోలీసులకు సూచనలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లక్షలాదిగా తరలివస్తున్న భక్తులకు భద్రతా కల్పించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగకుండా బ్లూకోట్స్ సిబ్బందిని నియమించామన్నారు. దాదాపు 1000 మంది సిబ్బంది విధుల్లో ఉన్నారన్నారు. ఎస్పీ వెంట శ్రీశైలం సీఐ దివాకర్‌రెడ్డి, ఎస్ఐ లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

రెండో విడత నాడు-నేడుకు నిధులు విడుదల

- రూ.39.92 కోట్లు పేరెంట్స్ కమిటీ ఖాతాల్లో జమ

కర్నూలు సిటీ: జిల్లాలో ప్రభుత్వ విద్యా సంస్థల రూపురేఖలు మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మనబడి నాడు–నేడు రెండో విడత కింద చేపట్టిన పనులకు రూ.39.92 కోట్ల బిల్లులు మంజూరైనట్లు సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.వేణుగోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో విడత కింద 825 పాఠశాలలు, 60 అంగన్‌వాడీ కేంద్రాలు, 23 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో నాడు–నేడు కింద పనులు చేపట్టామన్నారు. ఈ విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిర్వహించిన పనులకు సంబంధించిన బిల్లులు ఆయా స్కూళ్ల పేరెంట్స్ కమిటీ బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు. స్కూళ్లలో జరిగిన పనులకు రూ.36.59 కోట్లు, అంగన్‌వాడీల్లోని పనులకు రూ.కోటి, జూనియర్ కాలేజీలలో చేసిన పనులకు రూ.2.33 కోట్లు మంజూరయ్యాయన్నారు. మిగిలిన స్కూళ్లలో జరుగుతున్న పనులకు సంబంధించి ఇసుక, సిమెంటు పర్యవేక్షణకు సమగ్ర శిక్ష కార్యాలయంలో ప్రత్యేకంగా రాజారావు (9550544197)ను నియమించామన్నారు.

ఇసుక పంపిస్తావా.. బంద్ చేస్తావా!

- ఆలూరు సీఐ బెదిరింపు



ఆలూరు సీఐ ఆర్. ఈశ్వరయ్య

ఆలూరు: తాను పంపిన ట్రాక్టర్లకు ఇసుకను నింపి పంపించాలని హాలహర్వి మండలం గూళ్యం గ్రామానికి చెందిన దుబ్బలింగను ఆలూరు సీఐ ఆర్. ఈశ్వరయ్య బెదిరించారు. ఈ ఆడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. గ్రామానికి సమీపంలో ఉన్న వేదావతి నది నుంచి దుబ్బలింగ తనకున్న ట్రాక్టర్ల ద్వారా ఇసుకను వివిధ గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. విషయం తెలుసుకున్న సీఐ ఫోన్ ద్వారా దుబ్బలింగతో మాట్లాడారు. ''అక్రమంగా వేదావతి నదిలో ఇసుక రవాణా చేస్తున్నావు.. నేను పంపుతున్న ట్రాక్టర్ డ్రైవర్‌కు ఇసుక ఎత్తి పంపు' అని సూచించారు. వేదావతి నది సమీపంలో ఉన్న పొలం యజమాని ఇసుక ట్రాక్టర్లును రస్తాను వదలడం లేదని దుబ్బలింగ సమాధానం చెప్పారు. దీంతో సీఐ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ''అందరికీ ఇసుక రవాణాను చేసుకోవడానికి ఎలా రస్తా ఇచ్చారు.. నేను పంపిన ట్రాక్టర్లకు ఇసుక పంపిస్తావా.. లేదంటే అంతా బంద్ చేస్తావా..సీఐ అంటే ఎవరికీ లెక్కలేకుండా పోయింది'' అని బెదిరించాడు. ఈ విషయంపై సీఐ ఆర్. ఈశ్వరయ్య మాట్లాడుతూ..పోలీసు సర్కిల్ కార్యాలయ మరమ్మతులకు సంబంధించి మాత్రమే నేను పంపిన ట్రాక్టర్‌కు ఇసుకను పంపాలని కోరానన్నారు. అందుకు తగిన నగదును చెల్లిస్తానని దిబ్బలింగకు చెప్పానన్నారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: జిల్లాలోని 26 కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో 6వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.వేణుగోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేజీబీవీల్లో 6, ఇంటర్ మొదటి సంవత్సరానికి 40 సీట్ల చొప్పున, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనాథ పిల్లలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తుకు అర్హులన్నారు. ముస్లిం, మైనార్టీ విద్యార్థులకు ప్రత్యేకంగా కల్లూరు, ఆదోనిలలో రెండు కేజీబీవీలు ఉన్నాయని, వీటిలో పేద ముస్లిం విద్యార్థినిలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ నెల 27 నుంచి వచ్చే నెల 20వ తేది వరకు apkgbv.apcfss.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు సమీపంలోని కేజీబీవీల ప్రిన్సిపాళ్లు, జీసీడీఓ 9000204936ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

పేలిన సెల్‌ఫోన్.. ఒకరికి గాయాలు

డోన్ రూరల్: సెల్ ఫోన్ పేలడంతో డోన్ పట్టణం వైఎస్ నగర్‌కు చెందిన నాగేంద్ర అనే వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. సొంత పనిమీద పాతబస్టాండ్‌కు వచ్చి తిరిగి నివాసానికి మోటారుసైకిల్‌పై వెళ్తుండగా ప్యాయింట్ జేబులో ఉన్న సెల్‌ఫోన్ పేలింది. దీంతో ఆయన వెంటనే మోటారుసైకిల్‌ను నిలబెట్టాడు. స్థానికులు బాధితున్ని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తొడపైన, చేతికి గాయాలయ్యాయి. డాక్టర్లు ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు.



పేలిన సెల్‌ఫోన్ (ఇన్‌సెట్) గాయపడిన నాగేంద్ర

రైతు బలవన్మరణం

వెల్దుర్తి: అప్పుల బాధతో కొసనాపల్లెకు చెందిన రైతు బోయ పెద్ద బోడెన్న గారి లక్ష్మన్న (43) సోమవారం మధ్యాహ్నం తన పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి ఓదార్చారు.

వండేదంతా మంచి నూనె కాదు !

- యథేచ్ఛగా వంటనూనెల కల్తీ
- తక్కువ ధరకు లభించే నూనెలతో వేరుశనగ, సన్‌ఫ్లవర్ ఆయిల్స్ కల్తీ
- కల్తీనూనెలతో జీర్ణకోశ వ్యాధులు, క్యాన్సర్ వచ్చే అవకాశం
- పట్టించుకోని ఆహార నియంత్రణ విభాగం
- నామమాత్రపు తనిఖీలతో సరి



కర్నూలు(హాస్పిటల్): మనం రోడ్డుపక్కన బండ్లో వేసే బజ్జీలు ఎంతో ఇష్టంగా నిలబడి మరీ తింటాము. అలాగే రెస్టారెంట్‌లకెళ్లి ఫ్రై ఐటమ్స్ లొట్టలేసుకుంటూ ఆరగిస్తాము. అప్పటి వరకు నోటి రుచికి అవి బాగానే ఉంటాయి. లోపలికి వెళ్లాక దానిని జీర్ణం చేయడానికి శరీరం పడే కష్టం అంతా ఇంతా కాదు. ఈ క్రమంలో అది పలు వ్యాధులకు గురవుతుంది. ఈ విషయం తెలియక చాలా మంది జిహ్వ రుచికి అలవాటు పడి కల్తీ నూనెతో తయారు చేసిన ఆహారాన్ని మరీ తింటున్నారు. కల్తీని నిరోధించాల్సిన ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఆ విషయాన్నే మరిచిపోయినట్లు వ్యవహరిస్తున్నారు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి నెలా 60 లక్షల లీటర్ల వంటనూనెను ప్రజలు వినియోగిస్తున్నట్లు అంచనా. జిల్లాలోని మూడు వేలకు పైగా ఉన్న దుకాణాల ద్వారా ఈ నూనె ప్రజలకు చేరుతోంది. గతంలో ఆహార నియంత్రణ విభాగం అధికారులు పలుచోట్ల దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు. కోవిడ్ పరిస్థితుల నేపథ్యంలో దాడుల తీవ్రత తగ్గించారు. ఆ తర్వాత కూడా నామమాత్రపు దాడులతో సరిపెడుతున్నారు. గతంలో కర్నూలులోని జొహరాపురం రోడ్డుతో పాటు ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు, నంద్యాల, డోన్ ప్రాంతాల్లో వంట నూనెలను కల్తీ చేస్తుండగా అధికారులు సోదాలు నిర్వహించి కేసులు నమోదు చేశారు. గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి ట్యాంకర్ల ద్వారా నూనెను తీసుకొచ్చి ఇక్కడి మిల్లుల్లో ప్యాకెట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. మూడేళ్ల క్రితం కల్తీనూనెలపై దాడులు చేసిన అధికారులు మళ్లీ దాడులు చేయక పోవడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నామమాత్రపు తనిఖీలతో సరి

జిల్లాలో విచ్చలవిడిగా కల్తీనూనె విక్రయాలు జరుగుతున్నా ఆహార నియంత్రణ విభాగంలోని అధికారులు పట్టించుకోవడం లేదు. ఏడాదికి ఒకటి, రెండుసార్లు తనిఖీలు చేసి మమ అనిపిస్తున్నారు. వీరు అన్ని రకాల ఆహార శ్యాంపిల్స్ కలిపి నెలకు 12 తీస్తే చాలన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి ట్యాంకర్ల ద్వారా పలు ఆయిల్ మిల్లులకు కల్తీ వంట నూనె జిల్లాకు వస్తున్నా పట్టించుకోవడం లేదు. ఏ నాడూ నూనె మిల్లులకు వెళ్లి పరిశీలించి కేసులు నమోదు చేసిన దాఖలాలు లేవు. ఆయా మిల్లుల్లో ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో మార్కెట్‌కు వచ్చినా అక్కడ కూడా వాటి శాంపిల్స్ సేకరించకపోవడంతో మార్కెట్‌లో కల్తీమాఫియా యథేచ్ఛగా చెలరేగిపోతోంది.

ఖరీదైన వంటనూనెల్లో కల్తీ

మార్కెట్‌లో బ్రాండెడ్ వంటనూనెలకు ఉన్న డిమాండ్ అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారింది. మార్కెట్‌లో పేరున్న కంపెనీలను పోలిన బ్రాండ్ పోలికతో ముద్రించి నకిలీ నూనెలను విక్రయించి అమ్ముతున్నారు. మహారాష్ట్ర, గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి ట్యాంకర్ల ద్వారా వచ్చిన మార్గరిన్, పామాయిల్, హేజిల్‌నట్ ఆయిల్‌ను వేరుశనగ, సన్‌ఫ్లవర్ ఆయిల్స్‌లో కలిపి వాటిని అందమైన ప్యాకెట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. ఎక్కువగా ఇలాంటి వంటనూనెలను రోడ్డు పక్కన వ్యాపారం చేసే తోపుడు బండ్లు, చిరువ్యాపారులకు అంటగడుతున్నారు. ఈ నూనెలతో చికెన్, మటన్, ఫిష్ ఫ్రైలతో పాటు పలు రకాల బజ్జీలు, వడలు తయారు చేసి విక్రయిస్తున్నారు. కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లలోనూ ఇలాంటి నూనెనే వాడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. మార్కెట్ రేటు కంటే ఈ నూనె ప్యాకెట్లు సగం ధరకే లభిస్తుండటంతో వ్యాపారులు వాటిని కొని వ్యాపారం చేస్తున్నారు.

ఇలాంటి నూనెలు వాడాలి

మనం వాడే నూనెలో మోనో అన్ సాచ్యురేటెడ్, పాలి అన్ సాచ్యురేటెడ్, ఒమెగా 3 ఫ్యాటీ ఉండేటట్లు చూసుకోవాలి. ఈ మూడు ఏ ఆయిల్‌లో ఎక్కువ పరిమాణంలో ఉంటాయో అవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఇలాంటి ఆయిల్స్ వాడటం ద్వారా చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్)ను తగ్గించి హెచ్‌డీఎల్ కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. దీనివల్ల గుండెకు మేలు కలుగుతుంది. రక్తనాళాలు పూడిపోవు. బరువు పెరగరు. దీనివల్ల గుండెపోటు రిస్క్ బాగా తగ్గుతుంది. ఇవి శరీరంలో యాంటి ఇన్‌ఫ్లేమటరీగా కూడా పనిచేస్తాయి. మనం వాడే నూనెలో ఎక్స్‌ట్రా వర్జిన్ ఉండేటట్లు చూసుకోవాలి. వర్జిన్ అంటే ఎక్కువగా కెమికల్ ప్రాసెసింగ్ లేకుండా తయారు చేసినది. ఇది ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. కొంచెం ధర ఎక్కువైనా ఆరోగ్యానికి మేలు చేస్తాయి. గానుగల్లో తయారైన నూనెలు ఈ తెగకు చెందినవి. వీటిలో వంటకు, ఆరోగ్యానికి సన్‌ఫ్లవర్, వేరుశనగ నూనె మంచివని వైద్యులు సూచిస్తున్నారు.

కల్తీ నూనెలతో జీర్ణకోశవ్యాధులు



కల్తీనూనెలను వాడటం ద్వారా జీర్ణకోశవ్యాధులు, స్థూలకాయం, క్యాన్సర్, పిత్తాశయంలో రాళ్లు ఏర్పడతాయి. ఎంత మంచి నూనె అయినా ఒకసారి వేడి చేసి వాడిన తర్వాత మళ్లీ వాడకూడదు. ఇలాంటివి హోటల్స్, రోడ్డు సైడు వ్యాపారస్తులు ఎక్కువగా వాడతారు. నూనెను మళ్లీ వేడి చేసి వాడటం వల్ల దాంట్లో ఫ్రీ రాడికల్స్, ఆల్డిహైట్స్ తయారవుతాయి. ఇవి మనిషిలో వ్యాధి నిరోధకశక్తిని తగ్గించి అనేక వ్యాధులకు కారణమవుతాయి. మార్కెట్‌లో ఆయిల్ కొనేటప్పుడు ఏమేమి ఎక్కువగా ఉంటాయనేది ప్యాకెట్‌పై రాసి ఉంటారు. పాలి అన్ సాచ్యురేటెడ్ ఉన్నది చూసి కొనుగోలు చేయాలి. సాచ్యురేటెడ్ ఫ్యాట్, ట్రాన్స్‌ఫ్యాట్స్ ఉండేది కొనకూడదు.

–డాక్టర్ వెంకటరంగారెడ్డి, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి, కర్నూలు ప్రభుత్వ వైద్యశాల

వృద్ధిలోకి కేడీసీసీ బ్యాంకు

గణనీయంగా పెరిగిన డిపాజిట్లు, రికవరీలు, షేర్ క్యాపిటల్

- 2020–21 నుంచి నష్టాలను అధిగమించి లాభాల బాట
- లాభాల నుంచి సభ్యులకు డివిడెండు పంపిణీ
- త్వరలోనే ఆర్‌బీఐ సెక్షన్–11 నుంచి విముక్తి



కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు దినదినాభివృద్ధి చెందుతోంది. పాత నష్టాల నుంచి పూర్తిగా బయట పడటం, 2020–21 నుంచి నికర లాభాల్లోకి రావడం, డిపాజిట్లు, షేర్‌క్యాపిటల్, రికవరీలు గణనీయంగా పెరగడం తదితర కారణాలతో కేడీసీసీబీ బలోపేతమైన బ్యాంకుగా నిలువనుంది. కొన్నేళ్ల క్రితం డీసీసీబీని రిజర్వు బ్యాంకు సెక్షన్–11 కింద బలహీనమైన బ్యాంకుగా పరిగణించింది. నష్టాలు అధికమవడం, నిరర్థక ఆస్తులు ఎక్కువగా ఉండటం, షేర్ క్యాపిటల్ తక్కువగా ఉండటం, డిపాజిట్లు అంతంతమాత్రంగా ఉండటమే ఇందుకు కారణం. ఫలితంగా నాబార్డు, ఆప్కాబ్ తదితరాల నుంచి పలు ప్రయోజనాలను కోల్పోవాల్సి వచ్చింది. అయితే ఇటీవల కాలంలో బ్యాంకు పాలక వర్గం చైర్మన్ మహాలక్ష్మి, సీఈఓ పి.రామాంజనేయులు తీసుకుంటున్న చర్యల ఫలితంగా బ్యాంకు వృద్ధిలోకి వస్తోంది. ఒకటి, రెండు రోజుల్లో డీసీసీబీకి సెక్షన్–11 నుంచి విముక్తి కల్పిస్తూ ఆర్‌బీఐ ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికీ పలు డీసీసీబీలో ఈ సెక్షన్ పరిధిలోనే ఉన్నా.. ఒక్క కర్నూలు మాత్రమే బయటపడనుండటం విశేషం.

వడ్డీ రేటు అధికం

మిగిలిన బ్యాంకుల కంటే వడ్డీరేటు ఎక్కువగా ఇస్తుండటం వల్ల డిపాజిట్లు పెరిగాయి. రికవరీలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. సీనియర్ అధికారులతో ప్రత్యేక టీములు వేసి మొండి బకాయిలను రాబడుతున్నాం. షేర్ క్యాపిటల్ భారీగా పెరగడానికి సమిష్టి కృషితో ముందుకెళ్తున్నాం.

– మహాలక్ష్మి, కేడీసీసీబీ చైర్‌పర్సన్

నికర లాభాల్లోకి డీసీసీబీ

కొన్నేళ్లుగా ఉన్న నష్టాలను అధిగమించిన డీసీసీబీ స్పష్టమైన లాభాల్లోకి వచ్చింది. 2020–21 నుంచి లాభాల బాట పట్టడంతో సభ్యులకు డివిడెండు కూడా అందుతోంది. డిపాజిట్లు గణనీయంగా పెరగడంతో పాటు బ్యాంకు టర్నోవర్ దాదాపు రూ.5వేల కోట్లకు చేరుకుంది. డీసీసీబీలో షేర్ క్యాపిటల్ రూ.300కోట్లకు పైగా ఉంది. ఆదోని, ఆలూరు, కృష్ణానగర్, డోన్, ఎమ్మిగనూరు బ్రాంచీల్లో బకాయిలు ఎక్కువగా ఉండటంతో రెండేళ్లుగా రికవరీలు పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఫలితంగా రికవరీలు పెరిగి, బ్యాంకు నిరర్థక ఆస్తులు తగ్గిపోయాయి.

డీఎస్‌పీసీఏ సభ్యుల నియామానికి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(సెంట్రల్): డబ్లిన్ సొసైటీ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ క్రుయాలిటీ టు అనిమల్స్(డీఎస్‌పీసీఏ) జిల్లా కమిటీ సభ్యుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ పి.కోటేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ చైర్మన్‌గా డీఎస్‌పీసీఏలో నాన్ ఆఫీషియల్ నుంచి ఒక్కరు ఉపాధ్యక్షుడు, ఒక్కరు కార్యనిర్వాహక కార్యదర్శితో పాటు నలుగురు సభ్యుల నియామకానికి యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా జంతు సంక్షేమ కార్యకలపాలు నిర్వహిస్తున్న ఎన్‌జీఓలు అర్హులని, వారు మూడేళ్ల పాటు అందించిన సేవలకు సంబంధించి వివిధ డాక్యుమెంట్లను దరఖాస్తుకు జతపరచాలని, ఆసక్తి ఉన్న వారు పశుసంవర్ధక శాఖలో ఏప్రిల్ 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

రైలు నుంచి జారి పడి ప్రయాణికుడు మృతి

ఆదోనిటౌన్: వేగంగా వెళ్తున్న రైలు నుంచి జారి పడి కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లా షాపూర్ తాలూకా అయ్యాళ్ గ్రామానికి చెందిన కెంచెప్ప(45) మృతి చెందాడు. ఆదోని ఆర్‌పీఎఫ్ ఇన్‌చార్జి కె.గోపాల్ తెలిపిన వివరాల మేరకు.. కెంచెప్ప భార్య, పిల్లలతో కలిసి రైలులో బెంగళూరుకు వెళ్తున్నాడు. ఆదివారం రాత్రి కోసిగి–కుప్పగల్ రైల్వే స్టేషన్ల మధ్య రైలు నుంచి జారిపడ్డాడు. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఆదోని ఆర్‌పీఎఫ్ ఇన్‌చార్జి చెప్పారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించామన్నారు.

భార్యపై కత్తితో దాడి

మద్దికెర: మండల కేంద్రమైన మద్దికెరలో సోమవారం మహముదా అనే మహిళపై ఆమె భర్త గుంతకల్లుకు చెందిన అహమ్మద్ కత్తితో దాడి చేసి గాయపరిచాడు. వీరిద్దరికి పదేళ్ల క్రితం వివాహం జరగగా ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇద్దరి మధ్య విభేదాలు ఉండడంతో ఆరు నెలల క్రితం పెద్దల సమక్షంలో విడిపోయారు. పిల్లలతో మాట్లాడాలని ఇంటికి వచ్చి భార్య మహముదాపై కత్తితో అహమ్మద్ దాడి చేసి పారిపోయాడు. మహిళకు చేతులకు గాయాలవడంతో గమనించిన కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుంతకల్లు వైద్యశాలకు తరలించారు.

బైక్ అదుపు తప్పి యువకుడు మృతి

నందికొట్కూరు: పట్టణ శివారులోని జగనన్న కాలనీ సమీపంలో బైక్ అదుపు తప్పి ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పగిడ్యాల మండలం నెహ్రూనగర్ గ్రామానికి చెందిన షేక్‌గౌస్(26) గౌండ పని నిమిత్తం ఆదివారం నందికొట్కూరుకు వచ్చాడు. పని ముగించుకుని అర్ధరాత్రి బైక్‌పై స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా అదుపు తప్పి కింద పడి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి మహబూబ్ ఖాతున్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమణ తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతి

సంజామల(కోవెలకుంట్ల): మండల కేంద్రమైన సంజామల సమీపంలోని పాలేరువాగులో గల్లంతైన వ్యక్తి శవమై కనిపించాడు. ఎస్‌ఐ ప్రతాప్ అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన కోడూరు పెద్ద వెంకటయ్య(54) ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రయినా తిరిగి రాలేదు. కుటుంబీకులు గ్రామ శివారులో గాలించగా.. పాలేరు వాగు గట్టుపై వెంకటయ్య చెప్పులు, సెల్‌ఫోన్ ఉండటంతో వాగులో గల్లంతయి ఉంటాడని భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం గాలించగా వాగులో మృతదేహం లభ్యమైంది. స్నానానికి వాగులోకి దిగి ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతి చెంది ఉండవచ్చునని కుటుంబీకులు అనుమానిస్తున్నారు. మృతుని భార్య కాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

స్పందన సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

- డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): స్పందన కార్యక్రమానికి వచ్చిన సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని అధికారులకు డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు సూచించారు.కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ.. ప్రతి గ్రామ, వార్డు సచివాలయంలో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు కచ్చితంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. స్పందన అర్జీలు రీ ఓపెయిన్ కాకుండా చర్యలు తీసుకోవాలాన్నరు. సమస్యల పరిష్కారానికిసంబంధించిన ఫొటోలను స్పందన పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. స్పందన కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రమ, మల్లికార్జునుడు, సీపీఓ అప్పలకొండ, డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు

స్పందనలో వచ్చిన కొన్ని ఫిర్యాదులు..

- తమ పూర్వీకుల నుంచి వచ్చిన భూములు ఆన్‌లైన్‌లో వేరొకరి పేరు మీద ఉన్నాయని, వాటిని తొలగించి తన పేరును చేర్చాలని గోనెగండ్ల మండలం బ్రాహ్మణదొడ్డికి చెందిన బోయ తిమ్మగురుడు ఫిర్యాదు చేశాడు.
- పందులు పొలాల్లోని పంటలు, కళ్లాల్లోని మేతను నాశనం చేస్తున్నాయని వాటిని ఇతర ప్రాంతాలకు తరలించాలని కర్నూలు మండలం పంచలింగాలకు చెందిన భాస్కరరెడ్డి అర్జీ ఇచ్చారు.
- భూమిని అమ్మి, తర్వాత ఆ భూమి తమదే అంటూ కద్రెన్న దౌర్జన్యం చేస్తున్నాడని గోనెగండ్ల మండలం కున్నూరుకు చెందిన ఏసన్న ఫిర్యాదు చేశాడు.
- తమది చాలా పేద కుటుంబమని, ఇల్లు మంజూరు చేయాలని కర్నూలులోని వీకర్స్ సెక్షన్ కాలనీకి చెందిన షేక్ రహంతుల్లా విన్నవించారు.

పంట నష్టంపై ఎన్యూమరేషన్

కర్నూలు(అగ్రికల్చర్): అకాల వర్షాలతో పంటలకు జరిగిన నష్టంపై ఎన్యూమరేషన్ చేయాలని వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల వడగండ్లు, పెనుగాలులతో కురిసిన అకాల వర్షాలతో జిల్లాలోని కర్నూలు, కల్లూరు, గూడూరు, సీ.బెళగల్, ఓర్వకల్లు మండలాల్లో 1257.56 ఎకరాల్లో మొక్కజొన్న, ఆముదం పంటలకు నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ఉద్యాన పంటలు 26.90 హెక్టార్లలో దెబ్బతిన్నాయి. నంద్యాల జిల్లాలో వ్యవసాయ పంటలు 6,283 హెక్టార్లు, ఉద్యాన పంటలు 1,083.15 హెక్టార్లలో దెబ్బతిన్నట్లుగా ప్రాథమిక నివేదికలు ఇచ్చారు. 33 శాతం కంటే ఎక్కువ మోతాదులో జరిగిన పంట నష్టాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నారు. దెబ్బతిన్న పంటలు ఈ–క్రాప్‌లో నమోదు అయి ఉండాల్సి ఉంది. ఒక రైతుకు గరిష్టంగా 2 హెక్టార్లు నమోదు చేస్తారు. ఈ నెల 30లోగా ఎన్యూమరేషన్ పూర్తి చేయాల్సి ఉంది. ఏప్రిల్ 1 నుంచి 4 వరకు ఆర్‌బీకేల్లో జాబితాలను సోషల్ ఆడిట్‌కు పెట్టి అభ్యంతరాలు స్వీకరిస్తారు.



దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

దెబ్బతిన్న పంటల పరిశీలన

ఇటీవల కురిసిన వర్షాలతో కర్నూలు మండలం నూతనపల్లి, పసుపల గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి సోమవారం పరిశీలించారు. వడగండ్ల వానతో 1,400 ఎకరాల్లో మొక్కజొన్న, ఆముదం, జొన్నతో పాటు ఇతర పంటలు దెబ్బతిన్నాయని రైతులు ఈ సందర్భంగా డీఏవోకు వివరించారు. డీఏవోతో పాటు ఏడీఏ సాలురెడ్డి, కర్నూలు మండల వ్యవసాయ అధికారి విశ్వనాథ్, ఆర్‌బీకే ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.